క్లుప్తంగా

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు 900 మంది దరఖాస్తు



పాలిసెట్ ప్రవేశ పరీక్ష మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

బేతంచెర్ల: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2025 ప్రవేశ పరీక్ష గడువు గురువారంతో ముగిసినట్లు ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ తెలిపారు. ఈనెల 30వ తేదీ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. బేతంచెర్ల మండలంలో ప్రవేశ పరీక్షకు 900 మందివిద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. విద్యార్థులకు పాలిసెట్ ప్రవేశ పరీక్ష మెటీరియల్ ఇచ్చి ఉచిత శిక్షణను ప్రారంభించారు.

వీధిలైట్లు ఏర్పాటు



లైట్లు అమర్చుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో గురువారం సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో వీధి లైట్లు ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న నాయినపల్లె రోడ్డులో వీధిలైట్లు లేక అంధకారం ఏర్పడుతుండేది. కాలనీ వాసులు ఇబ్బందులు పడుతుండడంతో సుమారు పదిహేను లైట్లు అమర్చారు. గ్రామంలో అన్ని వీధుల్లో వీధిలైట్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు.

రాచర్ల ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



రమేశ్‌బాబు

ప్యాపిలి: సర్కిల్ పరిధిలోని ఎస్.రాచర్ల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా రమేశ్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన లక్ష్మణరావు అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కర్నూలు వన్ టౌన్ నుంచి రమేశ్ బాబు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మట్లాడుతూ.. పీఎస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

సోమేశ్వరరావ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

డోన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సోమేశ్వరరావ్ చేసిన సేవలు వెలకట్టలేనివని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అన్నారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో సోమేశ్వరరావ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గురువారం నివాళులర్పించారు. ఆయన త్యాగ ఫలితంగానే పెన్షనర్లు ప్రభుత్వం నుంచి అనేక ప్రయోజనాలు పొందగలుగుతున్నారని కొనియాడారు. సంఘం కార్యదర్శి గాలయ్య, గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, కోశాధికారి గోపాల్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ కృష్ణయ్య గురువారం పాఠ్య పుస్తకాలను అందజేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. విద్యార్థులు కళాశాలకు వచ్చి పుస్తకాలు తీసుకోవాలన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న ఎంపీపీ

డోన్ రూరల్: జనాభ లెక్కల ప్రకారం నిధులు మంజూరు చేయాలని డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి కోరారు. గురువారం తిరుపతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమీక్ష సమావేశానికి ఉమ్మడి కర్నూలు జిల్లా తరుపున రాజశేఖర్‌రెడ్డి హాజరై సంఘం చైర్మన్‌కు వినతి పత్రం అందించారు.

ప్రజాప్రతినిధులు..

వేతన వేతలు

- 20 నెలలుగా అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో ఎంపీటీసీ సభ్యులు
- మండల్ మీట్‌కు ముఖం చాటేస్తున్న వైనం



వేతనాలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు (ఫైల్)

ప్యాపిలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులకు సైతం గౌరవ వేతనాలు ఇవ్వకుండా వారి సహనాన్ని పరీక్షిస్తోంది. ప్యాపిలి మండలంలో మొత్తం 21 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. 2021 సెప్టెంబర్ 24వ తేదీ నుంచి వీరంతా ఎంపీటీసీలుగా కొనసాగుతున్నారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ. 3 వేలు చొప్పున గౌరవ వేతనాలు ఇస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో రెండు విడతల్లో ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించింది. సార్వత్రిక ఎన్నికల కారణంగా గత ప్రభుత్వం వీరి వేతనాలు చెల్లించలేకపోయింది. 2025 జూన్‌లో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అంతకు ముందు నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటి వరకు మొత్తం 20 నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు ఎంపీటీసీ సభ్యులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పలువురు ఎంపీటీసీలు మండల స్థాయి సమావేశాలకు హాజరు కాలేని పరిస్థితి నెలకొంది.

సర్వసభ్య సమావేశాల బహిష్కరణ

మండలంలో జరిగిన అభివృద్ధి గురించి చర్చించడానికి అధికారులు ప్రతి మూడు నెలలకోసారి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి 21 మంది ఎంపీటీసీలకు గాను కనీసం ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు ఉంటే కోరం ఉన్నట్లు పరిగణించి సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. అయితే తమకు గౌరవ వేతనాలు ఇవ్వనందున తాము మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యులు ఈ నెల 15వ తేదీనే స్పష్టం చేశారు. 16వ తేదీ మధ్యాహ్నం 12 గంటలైనా సభ్యులు రాకపోవడంతో సభను 17వ తేదీకి వాయిదా వేశారు. 17వ తేదీ కూడా కోరం లేకపోవడంతో మరోసారి సభను వాయిదా వేశారు.

ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరుతో సభ వాయిదా



సర్వసభ్య సమావేశానికి 16,17 తేదీల్లో ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో సభను వాయిదా వేశాం. తదుపరి సభ నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తాం. వేతనాలు చెల్లించలేదన్న కారణంతోనే ఎంపీటీసీ సభ్యులు సభకు గైర్హాజరైన విషయం మాకు తెలియదు. దీని గురించి మాకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందలేదు.

–బాలకృష్ణుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ప్యాపిలి

గ్రాంటు కూడా ఇవ్వడం లేదు



ఎంపీటీసీలకు ప్రభుత్వం గౌరవ వేతనాలతో పాటు గ్రాంటు, అలవెన్సు కూడా ఇవ్వడం లేదు. మాకు ఇచ్చే గ్రాంట్లతో స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. గ్రాంటు ఇవ్వకపోవడంతో అభివృద్ధి పనులు కూడా ఆగిపోయాయి. సభలు, సమావేశాలకు మండల కేంద్రానికి వచ్చిపోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. ఇందుకోసం అలవెన్సు కూడా ఇవ్వకపోవడంతో ఎంపీటీసీలు సర్వసభ్య సమావేశానికి గైర్హాజరవుతున్నారు.

–మదన శేఖర్, జలదుర్గం–1, ఎంపీటీసీ

ప్రజాప్రతినిధులంటే అంత అలుసా



ప్రజాప్రతినిధులంటే ప్రభుత్వానికి అలుసైపోయారు. ఎంపీటీసీ సభ్యులందరూ ఆర్థిక స్తోమత కలిగినవారిలా ప్రభుత్వం పరిగణిస్తోంది. 20 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే సభలకు, సమావేశాలకు ఎలా రావాలి? మా సమస్యలు కూడా ప్రభుత్వానికి తెలియాలని సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మాకు రావాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

–మద్దయ్య, ఊటకొండ, ఎంపీటీసీ సభ్యుడు

ప్రభుత్వం స్పందించాలి



గౌరవ వేతనాలు, గ్రాంట్లు, అలవెన్సులు రాకపోవడంతో మా ఇబ్బందులు అధికారులు గుర్తించాలనే సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం. ఈ విషయాన్ని అధికారులు జిల్లా అధికారుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలి. వేతనాల చెల్లింపు విషయంలో ప్రభుత్వం స్పందించాలి.

–శేఖర్, బోంచెర్వుపల్లి, ఎంపీటీసీ

మరోసారి సర్వసభ్య సమావేశం వాయిదా

ప్యాపిలి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం మరోమారు వాయిదా పడింది. వరుసగా రెండో రోజు కూడా ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కాకపోవడంతో కోరం లేదని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలకృష్ణుడు తెలిపారు. తదుపరి సమావేశం నిర్వహించే తేదీని తర్వాత ప్రకటిస్తామన్నారు.

నేడు బేతంచెర్లకు మాజీ మంత్రి రాక

బేతంచెర్ల: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం బేతంచెర్లకు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, పార్టీ నాయకులు, ప్రజలు గమనించగలరని పేర్కొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.14 వేలు విలువైన ఫర్నిచర్‌ను గురువారం విరాళం ఇచ్చారు. ఇదే పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న వీవీ కృష్ణయ్య ఆరు నెలల క్రితం అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం బీరువ, ఆరు కుర్చీలను భార్య జయ లక్ష్మి, కుమారులు ముఖేష్, నాగర్జున అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

కోవెలకుంట్ల: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కోవెలకుంట్ల డిపో గేటు ఎదుట గురువారం ఆర్టీసీ కార్మికులు ధర్నా చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, కేవీస్ ఆచారి మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని కోరారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019 అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులు వెంటనే ఇవ్వాలని, 114 జీఓలో పొందుపరిచిన విధంగా నైట్అవుట్ అలవెన్సును రూ. 150 నుంచి రూ. 400లకు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు రాముడు, షంషావలి, వెంకటేశ్వర్లు, ఖాన్, ఓబులేసు, పాల్గొన్నారు.

ఫీజుల ఒత్తిడి చేస్తున్నారని ఫిర్యాదు

డోన్ టౌన్: విద్యా హక్కు చట్టం ద్వారా గత ఏడాది ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు చెల్లించాలని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ ప్రభాకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డోన్ పోస్టుమాస్టర్‌కు పురస్కారం



పద్మావతమ్మను అభినంధిస్తున్న పోస్టల్ సిబ్బంది

డోన్ టౌన్: రాష్ట్ర స్థాయి ఉత్తమ పోస్ట్ మాస్టర్‌గా డోన్ హెడ్ పోస్టాఫీసులో విధులు నిర్వహిస్తున్న పద్మావతమ్మ ఎంపికయ్యారు. ఇటీవల తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక పోస్టాఫీసులో పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆలా లక్ష్మీకాంతరెడ్డి, తిమ్మారెడ్డి, ఇన్‌చార్జ్ పోస్ట్‌మాస్టర్ నాగరాజు ఆమెకు అభినందనలు తెలిపారు. పోస్టల్ ఉద్యోగులు రాజేష్‌నాయక్, రామశివయ్య, మహేష్, వెంకటేష్ ఉన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కేశిరాజు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ.150, మిగిలిన వారు రూ.200 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. డోన్ స్కూల్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని సీహెచ్‌ఓల నిరసన





బేతంచెర్ల పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు, చిన్నమల్కాపురంలో..

బేతంచెర్ల: జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సీహెచ్‌ఓలు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా జీత భత్యాలను పెంచాలని కోరారు. భాస్కర్, ఆచారి, శ్రీనివాసులు, రాజేశ్వరి బాయి, పుష్పలత, సువర్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ రూరల్: ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న సీహెచ్‌ఓల డిమాండ్లను నెరవేర్చాలని చిన్నమల్కాపురం చిన్నమల్కాపురం పీహెచ్‌సీ ఎదుట సీహెచ్‌ఓలు గురువారం నిరసన తెలిపారు. సకాలంలో జీతాలు రావడం లేదని..అరకొర జీతంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. చెన్నకేశవులు, శివకృష్ణ, సుమలత, మల్లేశ్వరి, పార్వతి, శ్రీజ, లక్ష్మి దీప్తి పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



రథంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవస్వామి



భక్తులతో కిక్కిరిసిన ఆలయం

బేతంచెర్ల: గొరిపేట చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి గురువారం రథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, నైవేద్య సమర్పణ, మహా మంగళహారతి ఇచ్చారు. స్వామిఅమ్మవార్లను రథంపై కొలువుంచి బ్రహ్మణులు లాగారు. ఉత్సవాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణం కిక్కిరిసిపోయింది. ఆలయ ఈఓ మద్దిలేటి, ఆయన మాజీ చైర్మన్ సుజాతశర్మ, కమిటీ సభ్యులు శ్రీధర్ రెడ్డి, మారుతి కృష్ణ, అన్నారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

కీటకజనిత వ్యాధులపై దృష్టి పెట్టాలి



వైద్యాధికారిణి ద్వారా వివరాలు తెలుసుకుంటున్న డీడీ

ప్యాపిలి: కీటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులపై దృష్టి సారించాలని డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన ఆయన వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా నివారణ చర్యల్లో భాగంగా జనాభాలో 10 శాతం మందితో రక్త నమూనాలు సేకరించాలన్నారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన మందులు ఇవ్వాలని సూచించారు.. పీహెచ్‌సీలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని వైద్యాధికారిణి వాణిశ్రీని ఆదేశించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల రిజిస్టర్లను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో క్వాలిటీ అస్సురెన్స్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, సబ్ యూనిట్ అధికారి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అన్ని విధాలా అనర్థం



హాజరైన పొదుపు మహిళలు



మాట్లాడుతున్న అర్బన్ సీఐ ఇంతియాజ్‌బాషా

డోన్: బాల్య వివాహాల వల్ల పిల్లల బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పొదుపు మహిళలకు బాల్య వివాహాలపై ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐ ఇంతియాజ్ బాషా మాట్లాడుతూ..తల్లిదండ్రులు తమ పిల్లలకు 18, 21 ఏళ్లు నిండేవరకు వివాహాలు చేయరాదని సూచించారు. బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలతో ఆరోగ్యపరంగా, మానసికంగా ఎన్నో అనర్థాలు వస్తాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని షంషాద్‌బేగం వివరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ రాంనాథ్‌రావ్

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఉప వైద్యాధికారి రాంనాథ్‌రావ్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. గురువారం ఆస్పత్రిని తనిఖీ చేశారు. అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో సుఖప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల వైద్యసేవలు రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని సూపరింటెండెంట్ హనీఫ్‌ను ఆదేశించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోలర్ అధికారి లక్ష్మన్న ఉన్నారు.


పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్

సంజామల: గర్భిణులు, బాలింతలు పోషక ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రం హోం సైంటిస్ట్ లక్ష్మి ప్రియా అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అధ్వర్యంలో పోషణ పక్వాడా పక్షోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. సమతుల ఆరోగ్యం గురించి గర్భిణులు, బాలింతలకు వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు రోగనిరోధక శక్తినిస్తుందన్నారు. ఈఓఆర్డీ రాధిక రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ నారాయణదాసు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ శాంత, సుగుణ పాల్గొన్నారు.

కొంగబావకు ఆకలేసింది..!



కుందూనదిలో చేప పిల్లల కోసం వేట సాగిస్తున్న కొంగ

పొలాల్లో పంట ఉత్పత్తులు లేకపోవడంతో పక్షులు కడుపు నింపుకునేందుకు తిప్పలు పడుతున్నాయి. నాలుగు తిండిగింజలు దొరికితే చాలని ఆహారం కోసం అన్వేషిస్తున్నాయి. నీటి ఆధారిత ప్రాంతాల్లో పురుగులు, క్రిమికీటకాలను ఆహారంగా తీసుకునే కొంగలు సైతం ఆహారం కోసం అలమటిస్తున్నాయి. కోవెలకుంట్ల పట్టణ శివారులోని కుందూనదిలో కొన్ని కొంగలు చేపలను ముక్కుతో పట్టుకునేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. నదిలో నీరు పారుతుండడంతో చేప పిల్లలు దొరక్క నదంతా జల్లెడ పట్టాయి. ఎంతకు దొరక్కపోవడంతో అక్కడి నుంచి మరోచోటికి వెళ్తున్నాయి.

–కోవెలకుంట్ల




బహిరంగ ప్రదేశంలో మందు బాబులను గుర్తిస్తున్న డ్రోన్

మందుబాబులపై డ్రోన్ నిఘా

బేతంచెర్ల: మారుతున్న కాలనికి అనుగుణంగా సాంకేతికను ఉపయోగించుకుని నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. గురువారం వెల్దుర్తి రహదారిలో బహిరంగ మద్యం సేవిస్తున్న ఎం.పేండేకల్లు, కొలుములపల్లె గ్రామాలకు చెందిన ఆరుగురిని డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. మండలంలో డ్రోన్ ద్వారా ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరం అన్నారు.

ఇస్రోకు ఎంపికైన బనగానపల్లె వాసి



షేక్ అర్షద్ హుస్సేన్

బనగానపల్లె: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో జూనియర్ సైంటిస్టుగా బనగానపల్లెకు చెందిన షేక్ అర్షద్ హుస్సేన్ ఎంపికయ్యారు. ఈ నెల 8వ తేదీ సంబంధిత అధికారులు ఆయన పేరు ప్రకటించారు. ఆయనది పేద కుటుంబం. తండ్రి ఖాజా హుస్సేన్ సైకిల్‌షాపు నడుపుతూ కుటుంబాన్ని పోషించాడు. అర్షద్ ఒకటి నుంచి పదో తరగతి వరకు బనగానపల్లెలోని ప్రియదర్శిని పాఠశాలలో చదివారు. అనంతరం బనగానపల్లె వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఈసీఈ, పాణ్యం శాంతిరామ్ కళాశాలలో బీటెక్(ఈసీఈ) పూర్తి చేశారు. ఆ తరువాత 9 నెలల పాటు బనగానపల్లెలోని జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ ఇంజినీర్‌గా పనిచేశారు. 2013–15 మధ్య బనగానపల్లె వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా ఉన్నారు. 2016 నుంచి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) మినిస్టరీ ఆఫ్ డిఫెన్స్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. 2024 ఏప్రిల్ 18న జూనియర్ సైంటిస్ట్ పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. పట్టుదల, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఎంపికైనట్లు తెలిపారు.